క్లుప్తంగా

అన్నదానం.. మహాదానం

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: అన్నదానం మహాదానమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సహకారంతో అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఆంజనేయస్వామి, అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం, మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, గూనెల్లి రమేశ్ అప్ప, శ్రీశైలంగౌడ్, రాజేశ్వర్, రమేశ్, కృష్ణారెడ్డి, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'సీఎం కప్'ను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల్లో భాగంగా చేపడుతున్న మండలస్థాయి సీఎం కప్-2024 పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బన్సీలాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా క్రీడాపోటీలు నిర్వహిస్తోందన్నారు. గ్రామస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం నుంచి మండలస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ఈ నెల16 నుంచి 21వరకు జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు.

సంఘం ప్రారంభోత్సవానికి తరలిరావాలి

షాబాద్: ఈ నెల 14వ తేదీన తెలంగాణ కురుమ సంఘం భవన ప్రారంభోత్సవానికి కురుమలందరూ అధిక సంఖ్యలో తరలిరావాలని కురుమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాదయ్య, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీన నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి కురుమ సంఘ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి కురుమలు అధిక సంఖ్యలో రవాలని కోరారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



శంకర్‌పల్లి: క్రీడాకారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, తదితరులు



నందిగామ: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు



షాబాద్: మోడల్ పాఠశాలలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, సీఐ

క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- సీఎం కప్ మండలస్థాయి పోటీలు ప్రారంభం
- మూడురోజుల పాటు కొనసాగనున్న క్రీడలు



కొత్తూరు: క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేయడంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే విద్యార్థులు, యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. క్రీడాకారులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కొత్తూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్ క్రీడాకారులకు బహుమతులు అందజేయడానికి తనవంతుగా రూ.20 వేలు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య నాయకులు సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్, ప్రభాకర్, సురేందర్, నర్సింహ, జగన్, రాజా, హరినాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: సీఎం కప్‌లో భాగంగా మండల కేంద్రమైన నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా పలుగ్రామాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు, అధికారులు, నాయకులు హాజరై క్రీడల్లో ఆసక్తిగా పాల్గొన్నారు

క్రీడల్లోనూ రాణించాలి

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీఓ అపర్ణ, సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మోడల్ పాఠశాలలో సీఎం కప్ మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఎంపీఓ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కవిత, పీడీ బాబయ్య, పీఈటీలు సతీశ్, సత్యనారాయణ, భిక్షపతి తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

శంకర్‌పల్లి: విద్యార్థులు ప్రతి నిత్యం ఒక గంట పాటు తమకు నచ్చిన క్రీడలను ఆడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్-2024 మండల, మున్సిపల్ స్థాయి పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజు, ఎంఈఓ అక్బర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన



మొయినాబాద్‌రూరల్: క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు



కేశంపేట: మండలస్థాయి క్రీడాకారులతో అధికారులు

మొయినాబాద్‌రూరల్: ప్రజాసంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలోని గ్రామీణస్థాయి నుంచి క్రీడాకారులను వెలికితీసేందుకు సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారన్నారు. మంగళవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలను ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులు, యువకులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. అజీజ్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండలస్థాయి పోటీలకు ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఆర్‌ఐ సుజిత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జమిల్ రహమాన్, పంచాయతీ కారోబార్ శ్రావణ్‌కుమార్, మండల రేషన్ డీలర్ల నాయకులు కొత్త భాస్కర్‌రెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు ఎలిగేపల్లి శ్రీనివాస్‌యాదవ్, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

కేశంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తహసీల్దార్ అజాంఅలీ అన్నారు. మండల కేంద్రంలో సీఎం కప్ మండలస్థాయి పోటీలను మంగళవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల విద్యాధికారి చంద్రశేఖర్, సీఐ నరహరి, ఎస్‌ఐ రాజ్‌కుమార్, మండల వైద్యాధికారి నిఖిత, కేశంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వీరారెడ్డి, క్రీడల ఇన్‌చార్జి ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పూజలో పడి ముట్టిస్తున్న స్వాములు

చేవెళ్ల: స్వామి శరణం.. అయ్యప్ప శరణం స్వామియే అయ్యప్ప.. అయ్యప్పో స్వామియే అంటూ భక్తుల నినాదాలు, స్వామివారి భక్తిగీతాలతో మల్కాపూర్ గ్రామం భక్తిభావంతో నిండిపోయింది. మండలంలోని మల్కాపూర్‌లో మంగళవారం గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటేశ్ 18వ పడిపూజను నగరానికి చెందిన అరుణ్ గురుస్వామి చేతుల మీదుగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అయ్యప్ప మాలధరించిన స్వాములతో పాటు ఇతర మండలాలకు చెందిన స్వాములు సైతం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పూజలో భక్తి గీతాలు ఆలపించేందుకు ప్రత్యేక భజన బృందాలను ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామంలో భక్తిపారవశ్యం సంతరించుకుంది. స్వాములకు, ప్రజలకు సీహెచ్ పాండు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పూజల్లో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి, మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రభాకర్, వెంకటేశ్, గణేశ్, వంగ శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ విజయలక్ష్మిరమణారెడ్డి, బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, గురుస్వాములు కృష్ణానస్ పంతులు, ఉమాశంకర్ గురుస్వామి, సత్యనారాయణ, సుబుద్ధి, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

విగ్రహం మార్పుపై రాద్ధాంతం ఎందుకు?

- తెలంగాణ ఉద్యమకారుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ కవులు, కళాకారులు, మేధావులు చర్చలు జరిపి రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహంపై బీఆర్‌ఎస్ నాయకులు ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారో అర్థం కావడం లేదని తెలంగాణ ఉద్యమకారుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలను ఇచ్చే విధంగా ఉండాలని, కానీ తెలంగాణ అస్థిత్వాన్ని అవమానపరిచే విధంగా ప్రభుత్వంపై అబండాలు వేస్తున్నారని ఆరోపించారు. 2014 ముందు పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయని, గడిచిన పదేళ్ల పాలనలో తెలంగాణ తల్లి విగ్రహం గురించి, కొత్త విగ్రహాలను అధికారికంగా ప్రతిష్ఠించాలనే ఆలోచన ఎప్పుడు చేయలేదన్నారు. సీమాంధ్ర నాయకుల కుట్రలను పట్టించుకోకుండా, ప్రత్యేక రాష్ట్రం ప్రకటిస్తే పార్టీ నష్టం జరుగుతుందని తెలిసినప్పటికీ సోనియాగాంధీ తెలంగాణ ప్రకటన చేశారన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, కవులు, కళాకారులకు 300 గజాల స్థలంతో పాటుగా కోటి రూపాయల పారితోషికాన్ని ఇస్తామని తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ సభలో ప్రభుత్వం ప్రకటించారన్నారు. ఉద్యమకారులు, కవులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, నాయకులు నక్క బాల్‌రాజ్, అర్జున్‌లక్ష్మణ్, దిలీప్‌కుమార్, శ్రీనివాస్‌యాదవ్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎంపీడీఓ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీఓ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీఓ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన నందిగామ మండల కేంద్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కనీసం మండల కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేకపోయిందని విమర్శించారు. కేవలం శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీలైనంత త్వరగా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలను పూర్తిచేస్తోందన్నారు. వచ్చే జనవరి 26లోపు ఎంపీడీఓ భవన నిర్మాణాన్ని పూర్తి చేసినట్లయితే జెండాను ఎగురవేస్తామని వివరించారు. భవనాలతో పాటు గ్రంథాలయం, ప్రెస్‌క్లబ్‌ను సైతం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ హేమంత్, ఏఎంసీ డైరెక్టర్ నర్సింహ, నాయకులు, కాంట్రాక్టర్ భిక్షపతి పాల్గొన్నారు.

ఆశవర్కర్ల ముందస్తు అరెస్టు

మొయినాబాద్: ఆశవర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం తలపెట్టిన హెల్త్ డైరెక్టర్ కార్యాలయం ముట్టడిని పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం ఉదయమే పోలీసులు ఆశవర్కర్లను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. బీఆర్‌ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆశవర్కర్లకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశవర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. వారికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవూఫ్, వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశవర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల సమస్యలు, డిమాండ్ల పరిష్కారం కోసం మంగళవారం చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా తమను అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

ప్రదర్శనలతోనే మేధస్సు పెంపు

- ఎంపీడీఓ అపర్ణ



విద్యార్థులు తయారు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

షాబాద్: ప్రదర్శనలతోనే విద్యార్థులకు మేధస్సు పెంపొందుతుందని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వెల్స్‌పన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో షాబాద్ బాలికల, కేజీబీవీ, టీఎస్‌ఎంఎస్ ఉన్నత పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలను పరిశీలించి, వాటి ఉపయోగాలను విద్యార్థులను అగిడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లోని విద్యార్థులు సైతం అన్ని రంగాల్లోనూ తీసిపోకుండా ముందుకు వస్తున్నారన్నారు. విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికితీసి వారి, ఆసక్తిని బట్టి వారు ఎంచుకున్న రంగంలో రాణించేలా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే విజ్ఞానంపై పట్టు సాధించాలన్నారు. సీవీ రామన్ సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకొని విజ్ఞానంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

షాద్‌నగర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని ధన్వంతరీ గ్రామీణ వైద్యుల సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన అధ్యక్షుడిగా రాజు(సిద్దాపూర్ రాజు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ధన్వంతరీ వైద్యుల సంఘం నూతన అధ్యక్షుడు రాజును ఎమ్మెల్యే పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆర్‌ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

పండుగ సాయన్నకు నివాళి



సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రజావీరుడు, పెత్తందారి వ్యవస్థపై తిరుగులేని పోరాటం చేసిన పండుగ సాయన్న వర్ధంతిని బీసీమహాసభ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ హాజరై ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌కుమార్, క్యాసెట్ శ్రీనివాస్, శ్రీధర్‌వర్మ, యాదయ్య, భరత్, వేణుగోపాల్, మల్లేశ్, వెంకటేశ్, అందె పైలయ్య, శ్రీకాంత్, మాధవాచారి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి

కొందుర్గు: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని యూటీఎఫ్ మహాసభలను నిర్వహించారు. ఈ సభలకు హాజరైన వెంకటయ్య మాట్లాడుతూ.. గత పదేళ్లుగా విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయమై పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కొంతవరకు విద్యారంగ సమస్యలపై దృషి సారించిందన్నారు.

నూతన కమిటీల ఏర్పాటు

టీఎస్ యూటీఎఫ్ జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీ అధ్యక్షుడిగా నీలా మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్, కొందుర్గు మండల కమిటీ అధ్యక్షుడిగా శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అధిరామ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్‌గౌడ్ కృష్ణ, రాజయ్య, సంజు, తేజస్విని, భాస్కర్ పాల్గొన్నారు.

అస్థిత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్ర

- తెలంగాణ ఉద్యమం, ఉద్యకారుల గురించి మాట్లాడడం విడ్డూరం
- తెలంగాణ తల్లి పాత విగ్రహాన్నే ప్రజలు కోరుకుంటున్నారు
- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



షాద్‌నగర్‌రూరల్: పాత తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



శంకర్‌పల్లి: శంకర్‌పల్లి చౌరస్తాలో..



మొయినాబాద్‌లో..

షాద్‌నగర్‌రూరల్: ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఏనాడూ జై తెలంగాణ అనని కాంగ్రెస్ నాయకులు నేడు తెలంగాణ ఉద్యమం, ఉద్యమకారుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ తల్లి పాత చిత్రపటానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఉద్యమాలను చేపట్టి కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అస్థిత్వాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఆనాడు మేథావులు, కవులు, కళాకారులు, రచయితలు, ఉద్యమాకారుల అభిప్రాయాలను క్షుణ్ణంగా చర్చించి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, సంపద వంటి అంశాలు ప్రపంచానికి చాటిచెప్పే విధంగా విగ్రహాన్ని రూపొందించారన్నారు. నేటి పాలకులు తమ స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ ప్రజలకు ఇష్టం లేకున్నా ఏకపక్ష నిర్ణయాలను తీసుకొని పేద మహిళగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ దీక్షతో దిగివచ్చిన అప్పటి కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన చేసిందని, సీమాంధ్ర పాలకులు ఆ ప్రకటనను వెనక్కి తీసుకునే కుట్రలు పన్నారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రకటన చేసిన డిసెంబర్ 9న తెలంగాణ ఇచ్చినట్లు, అదేరోజు రాష్ట్రం ఆవిర్భవించినట్లు సంబరాలు చేసుకోవాలని పాలకులు పిలుపునివ్వడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి పాత విగ్రహాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: చేవెళ్లలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన

శంకర్‌పల్లి: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి విగ్రహంలో కాంగ్రెస్ పార్టీ చేసిన మార్పులను నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం శంకర్‌పల్లి చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. గతంలో ఉన్న తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, సీఎంకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు రాజు నాయక్, ఉపేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లింగం, ఫరీద్, లక్ష్మినర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం దుర్మార్గం

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం దుర్మార్గమని బీఆర్‌ఎస్ నేతలు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి విమర్శించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మొయినాబాద్ మండల కేంద్రంలో పాత తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అస్థిత్వం, ఆత్మగౌరం, ఆకాంక్షను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవూఫ్, వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి..

కేశంపేట: తెలంగాణ తల్లి విగ్రహ రూపం మార్పుపై బీఆర్‌ఎస్ పార్టీ అధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహంచారు. మండల పరిధిలోని తొమ్మిదిరేకులలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగిళ్ల యాదయ్య, గోస్కె నర్సింలు, రాంరెడ్డి, అంజనేయులు, యాదగిరి, మల్లేశ్, యాదయ్య, నర్సింహారెడ్డి, పాండు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తల్లి వద్దు..

చేవెళ్ల: రాష్ట్ర ప్రజలకు ఉద్యమస్ఫూర్తిని నింపే తెలంగాణ తల్లినే కావాలని ఈ కాంగ్రెస్ తల్లి వద్దని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ తల్లి వద్దు తెలంగాణ తల్లినే కావాలి అంటూ నినాదించారు. తెలంగాణ తల్లినే కావాలని కాంగ్రెస్ తల్లి మాకు వద్దు అంటూ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని, రాజీవ్ గాంధీ విగ్రహాలను గాంధీభవన్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శేరి రాజు, వెంకటేశ్, సత్యనారాయణచారి, కృష్ణ, మానిక్యరెడ్డి, శ్రీనివాస్, గణేశ్ తదితరులు ఉన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సయ్యద్ హాఫీజ్, నాయకులు రాజేశ్‌పటేల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.